సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం, 16, ఫిబ్రవరి, 2024



హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 48 రోజులకు రూ.11,54,585 ఆదాయం లభించినట్టు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు.



నేడు దినకరుని కల్యాణం

రథసప్తమి సందర్భంగా సూర్యభగవానుడి కల్యాణోత్సవానికి తణుకులోని సూర్యాలయం ముస్తాబైంది.

8లో ▸



ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటనలో 27 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి.

8లో ▸

న్యూస్‌రీల్

రథసప్తమి వేడుకలకు సిద్ధం



చినవెంకన్న క్షేత్రంలో సూర్యప్రభ వాహనం

ద్వారకాతిరుమల: రథసప్తమి వేడుకలకు ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం ముస్తాబైంది. శుక్రవారం నిర్వహించనున్న స్వామి, అమ్మవార్ల తిరువీధి సేవలకు సూర్య, చంద్ర ప్రభ వాహనాలను ఆలయ సిబ్బంది గురువారం సిద్ధం చేశారు. ముందుగా వాహన శాల నుంచి సూర్య, చంద్ర ప్రభ వాహనాలను తీసుకొచ్చి ఆలయ ఆవరణలో ఉంచారు. అనంతరం వాటిని శుభ్రం చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు సూర్యప్రభ వాహనంపై, అలాగే రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్స్ తొలి దశ పరీక్షలో మండలంలోని ఆరుగొలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. 15 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, ఐదుగురు మంచి పర్సంటైల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. వీరిలో బి.దినేష్ 80.82, వి.సంజయ్‌కుమార్ 80.82 పర్సంటైల్ సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్

భీమవరం: జిల్లాలో గురువారం ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు ప్రకటనలో తెలిపారు. 2,429 మంది విద్యార్థులకు 2,377 మంది హాజరయ్యారని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు.

ఏలూరు జిల్లాలో...

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జిల్లాలోని 29 కేంద్రాల్లో జనరల్, 16 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు గురువారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. మొత్తం 2,953 మందికి 2,868 మంది హాజరయ్యారు. ఉదయం 1,114 మందికి 1,096 మంది, మధ్యాహ్నం 1,839 మందికి 1,772 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం నుంచి ఒకేషనల్ విద్యార్థులకు మూడో విడత, జనరల్ విద్యార్థులకు రెండో విడత ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సూచించారు. జిల్లా అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

9న జాతీయ లోక్‌అదాలత్



వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో వచ్చేనెల 9న జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి తెలిపారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార భవన్‌లో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గతంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,059 కేసులను పరిష్కరించి రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచామని, ఈసారి 7 వేల రాజీ యోగ్యమైన కేసులను గుర్తించామని రత్నప్రసాద్ అన్నారు. మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ ప్రతిరోజూ రాజీయోగ్యమైన కేసుల్లో ప్రీ సిట్టింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మధ్యవర్తిత్వం వహించే ఇరుపక్షాలకు సముచితమైన రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. చెక్ బౌన్స్ కేసుల్లో ఒకేసారి చెల్లించుకోలేని కక్షిదారులు వాయిదాల పద్ధతిలో చెల్లించేలా పరిష్కారం చూపుతున్నామన్నారు. కక్షిదారులు ఆన్‌లైన్‌లో కూడా కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

చకచకా రిజిస్ట్రేషన్లు

పేదలకు 'పక్కా' ఆస్తి

- సచివాలయాల్లో జోరుగా ప్రక్రియ
- జిల్లాలో 76,069 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ
- 67,046 స్థలాలకు మ్యాపింగ్
- ఇప్పటికే 56 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి



పోడూరు మండలం జిన్నూరు సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న లబ్ధిదారులు

సాక్షి, భీమవరం: పక్కా ఇళ్లపై పేదలకు శాశ్వత హక్కు కల్పిస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో జోరుగా సాగుతోంది. స్థానిక సచివాలయాల్లోనే లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. మ్యాపింగ్ పూర్తయిన మేర ఇప్పటికే 56 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

శాశ్వత హక్కు కల్పించేలా.. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీలో భాగంగా గత ప్రభుత్వాలు డి-పట్టాలు మాత్రమే పంపిణీ చేసేవి. అయితే పేదల కలను సాకారం చేసేలా సీఎం జగన్ రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు శాశ్వత హక్కు కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారుల పేరిట స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించి వారికి కన్వేయన్స్ డీడ్ అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులకు ఇంటిపై సర్వహక్కులు సంక్రమిస్తాయి. బ్యాంకులో తనఖా పెట్టి రుణసాయం పొందవచ్చు, అత్యవసర సమయాల్లో అమ్ముకోవచ్చు, వారసులకు గిఫ్టుడీడ్ బదలాయించే వెసులుబాటు ఉంటుంది.

జిల్లాలో ముమ్మరంగా..



జిల్లాలో 779 జగనన్న లేఅవుట్లలో 76,069 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ చేశారు. 67,046 స్థలాలకు మ్యాపింగ్ పూర్తి చేశారు. జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాల్లో వీటి రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. గురువారం నాటికి 35,948 స్థలాలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. పెనుమంట్ర మండలంలో అత్యధికంగా 83 శాతం పూర్తి కాగా, యలమంచిలి, పెంటపాడు, ఇరగవరం, వీరవాసరం, అత్తిలి, పోడూరు, ఆకివీడు, పెనుగొండ, తణుకు మండలాల్లో 70 శాతానికి పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గణపవరం మండలంతో పాటు నరసాపురం అర్బన్, మిగిలిన మండలాల్లో సాంకేతికపరమైన ఇబ్బందులతో 9,023 స్థలాలకు మ్యాపింగ్ పూర్తి కాలేదు. వీటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సాంకేతిక అవరోధాలను తొలగించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో రిజిస్ట్రేషన్ల వివరాలు

మండలం	లబ్ధిదారులు	మ్యాపింగ్ పూర్తి	రిజిస్ట్రేషన్ పూర్తి
తణుకు	12,636	11,352	4,822
నరసాపురం	6,948	6,398	1,380
భీమవరం	10,437	9,455	6,409
పాలకొల్లు	5,095	4,760	1,515
తాడేపల్లిగూడెం	6,598	4,711	2,438
గణపవరం	1,918	1,435	0
పాలకోడేరు	2,773	2,478	1,014
ఆకివీడు	4,294	4,077	2,960
ఉండి	2,790	2,432	1,575
పెనుగొండ	2,778	2,410	1,627
కాళ్ల	2,042	1,841	1,092
పోడూరు	2,397	2,292	1,618
ఆచంట	1,716	1,511	930
అత్తిలి	2,233	2,056	1,271
వీరవాసరం	2,277	1,925	1,320
పెనుమంట్ర	2,554	2,480	2,039
ఇరగవరం	1,875	1,727	1,304
పెంటపాడు	2,135	1,388	1,001
యలమంచిలి	1,710	1,671	1,257
మొగల్తూరు	863	647	376

చాలా ఆనందంగా ఉంది



సొంతిల్లు కట్టుకోవడం అనే కల నెరవేరుతుందని ఎన్నడూ అనుకోలేదు. గతంలో తాటాకింట్లో పిల్లలతో ఇబ్బందిగా ఉండేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక సొంతింటి కల సాకారమైంది. ఆ ఇంటిని నా పేరున రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– మొల్లేటి నాగదేవి, లక్ష్మణేశ్వరం

నాకు స్థిరాస్తి ఇచ్చారు



నా బిడ్డ జగన్ మా కన్నీళ్లు తుడిచాడు. స్థలం ఇచ్చి, ఇల్లు కట్టిపెట్టాడు. ఈ సంతోషం మాటల్లో చెప్పలేను. ధైర్యంగా, గర్వంగా సొంతింట్లో బతుకుతున్నాం. పుట్టింటి వాళ్లు ఆదరించినట్టు ఇంటికి రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్న జగన్‌బాబు రుణం తీర్చుకోలేం.

– బోణం సూర్యకుమారి, ఉత్తరపాలెం, మహదేవపట్నం

సొంతిల్లు సమకూరింది



40 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే మగ్గిపోయాం. ముగ్గురు పిల్లలతో చాలా ఇబ్బంది పడ్డాం. జగన్ సార్ వచ్చాక తణుకులో ఖరీదైన ప్రాంతంలో ఇంటి స్థలం మంజూరు చేశారు. ప్రభుత్వ సాయానికి మరికొంత జోడించుకుని సొంత ఇంటిని నిర్మించుకుని ఆనందంగా జీవిస్తున్నాం.

– షేక్ ముంతాజ్ బేగం, తణుకు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాకు ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు ఇంటిని నిర్మించి ఇచ్చారు. వితంతు పింఛన్ మంజూరు చేశారు. ఇప్పుడు ఇంటిని నా పేరున రిజిస్ట్రేషన్ చేయడం చాలా ఆనందంగా ఉంది. గతంలో సొంతిల్లు లేక చాలా ఇబ్బంది పడ్డాను.

– ముదునూరి సూర్యకుమారి, పెనుమంట్ర గరువు

త్వరితగతిన రిజిస్ట్రేషన్లు



జిల్లాలో ఇళ్ల స్థలాలకు త్వరితగతిన రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. మ్యాపింగ్ జరిగిన మేర ఇప్పటికే సగానికి పైగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు ఎదురవ్వగా వాటిని సరిచేసేలా చర్యలు తీసుకున్నాం. రిజిస్ట్రేషన్‌తో ఇంటిపై పేదలకు పూర్తి హక్కులు వస్తాయి.

– బి.శివనారాయణరెడ్డి, ఇన్‌చార్జి డీఆర్‌ఓ

పథకాలతో ఆడబిడ్డలు ఉన్నత స్థాయికి చేరాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆడబిడ్డలు ఉన్నత స్థాయికి చేరాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ పీఎల్ సరస్వతి అధ్యక్షతన బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కొట్టు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనే తపనతో ఉన్నారన్నారు. దిశ యాప్ ద్వారా రాష్ట్రంలో ఆడబిడ్డల రక్షణకు సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. సంక్షేమం, సంతోషం అందిస్తున్న సీఎం జగన్‌ను చూస్తే చంద్రబాబుకు కడుపు మంటగా ఉందని, అధికారం కోసం ప్రజలను మోసం చేసేందుకు కుయుక్తులతో వస్తున్నాడని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యాడని, పార్టీ మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించడంతో ఆయనపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. చంద్రబాబును అడ్డుపెట్టుకొని వేల ఎకరాలు ఆక్రమించిన అవినీతిపరుడు రామోజీరావు అని ఆరోపించారు. పచ్చ పత్రికలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై అవాస్తవాలను రాస్తున్నారని, వీటిని ఎవరూ నమ్మడం లేదన్నారు. అనంతరం విద్యార్థినులను ఆశీర్వదించి తల్లులను, బాలింతలను సత్కరించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇరగవరంలో సన్మానం అందుకున్న వలంటీర్లతో మంత్రి కారుమూరి

ఇరగవరం: రాష్ట్రంలోని వలంటీర్ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన వలంటీర్లకు అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు అభినందనలు తెలిపారు. సేవా మిత్ర 285 మందికి, సేవా రత్న ఐదుగురికి, సేవా వజ్ర అవార్డు ఇద్దరికి మొత్తం 292 మంది వలంటీర్లను ప్రశంసాపత్రం, నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకు అందిస్తూ, ప్రజాజీవితంలో భాగమైన వలంటీర్ వ్యవస్థ ఆదర్శంగా నిలిచిందన్నారు. కరోనా సమయం, వరదల వేళ అత్యవసర పరిస్థితుల్లో వలంటీర్ల సేవలు నిరుపమానం అన్నారు. వలంటీర్లు సేవే పరమావధిగా పనిచేస్తున్నారని, నవరత్నాల కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హుల దరికి చేరుస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. వలంటీర్లు కూడా వృత్తిపరమైన సంతృప్తి పొందుతున్నారన్నారు. ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకుల శ్రీనివాస్, ఎంపీటీసీలు మంగెన రామానాయుడు, ఎంపీడీఓ పద్మ జ్యోతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు నిలువుటద్దం సీఎం జగన్

విప్ గ్రంధి శ్రీనివాస్



కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం: ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మించిన నాయకుడులేరని, రాజకీయాల్లో విశ్వసనీయతను నిలబెట్టడం వల్లనే వైఎస్సార్‌సీపీకి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం ఉత్తరపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు అనుగుణంగా కరోనా వైరస్, ప్రకృతి విపత్తుల సమయంలోనూ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. విభజిత రాష్ట్రంలో ప్రభుత్వానికి సరైన ఆదాయం లేకున్నా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. పేదలకు పెద్ద ఎత్తున స్థలాల పట్టాలు పంపిణీ చేయడంతో పాటు గృహ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేలా ప్రతిఒక్కరూ పనిచేయాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన కట్టా పద్మ, కోడి ధనలక్ష్మి, దొంగ లక్ష్మి, జక్కంశెట్టి వరలక్ష్మి, వేండ్ర లక్ష్మీపార్వతి, చెల్లబోయిన మహాలక్ష్మి, కేతా మంగ, పాల సత్యవతి, చింతపల్లి మహాలక్ష్మి, పాలా శ్రీనివాస్, చింతపల్లి సత్యనారాయణ, వేండ్ర రామకృష్ణ, నాగబాబు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కోడి దుర్గాప్రసాద్, కేతా రామకృష్ణ, కో డి నాగదుర్గాప్రసాద్ , వేండ్ర నాగబాబు, పాలా ర మణ తదితరులకు కండువాలు వేసి పార్టీలోకి ఆ హ్వానించారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, వీరవాసరం మండల కన్వీనర్ కడలి ధర్మారావు పాల్గొన్నారు.

ఏటిగట్టు అభివృద్ధికి శాశ్వత పనులు



ఏటిగట్టు పటిష్ట పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఏటిగట్టు అభివృద్ధి పనిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన చేపట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతంలో జరుగుతున్న ఏటిగట్టు అభివృద్ధి పనులను గురువారం వేకువజామున ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతం వారితో మాట్లాడారు. పనులు జరుగుతున్న తీరుపై సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ఏటిగట్లు పాడైపోతే అప్పటి టీడీపీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందన్నారు. దివంగత వైఎస్సార్ తొలిసారిగా ఏటిగట్ల అభివృద్ధికి నాంది పలికారన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులతో గోదావరి గట్లను అభివృద్ధి చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏటిగట్టు పటిష్ట పనులను చేయిస్తున్నారని వివరించారు. నరసాపురం గోదావరి ఏటిగట్టు పటిష్ట పని మంచిగా సాగుతుందన్నారు. స్థానికంగా గోదావరి ప్రవాహ వేగం ఎక్కువగా ఉండటంతో పనిచేస్తున్నప్పుడు కొద్దిపాటి ఇబ్బందులుంటాయన్నారు. నేల స్వభావాన్ని బట్టి పని జరుగుతున్నప్పుడు వేసిన రాళ్లు జారడమనేది సహజమని, దీనికి సంబంధించిన సాంకేతిక కారణాలను అధికారులు కూడా వివరించారని చెప్పారు. ఈ పని మీద అవగాహన ఉన్నవాళ్లకు విషయం అర్థమవుతుందని, ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని తెలిపారు. పని పూర్తయిన తర్వాత ఏ ఇబ్బందీ ఉండదన్నారు. పార్టీ నాయకులు సీహెచ్ చిన రెడ్డప్పధవేజీ, గోరు సత్తిబాబు ఆయన వెంట ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీల నియామకం



కామన నాగేశ్వరరావు



చిన్నం సుధీర్



తోట సుధీర్



యర్రా కేశవరావు

ఏలూరు టౌన్/ఏలూరు టూటౌన్/భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు సంబంధించి రాష్ట్ర కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్ర ఎస్టీ విభాగ కమిటీ

జోనల్ ఇన్‌చార్జిగా ఏలూరు జిల్లాకు చెందిన మొడియం రామతులసి, ప్రధాన కార్యదర్శిగా కురసం నిరీక్షణరావు, రాష్ట్ర సెక్రటరీలుగా సోదెం సుధాకర్, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మేకల ఏడుకొండలు, జాయింట్ సెక్రటరీలుగా ఏలూరు జిల్లాకు చెందిన దేవరకొండ నాగేశ్వరరావు, తెల్లం సింహాచలం, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కావడి సాయిశంకరం.

రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ

రాష్ట్ర సెక్రటరీలుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కామన నాగేశ్వరరావు, ఏలూరు జిల్లాకు చెందిన చిన్నం సుధీర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన చోడి గోపీకృష్ణ, ఏలూరు జిల్లాకు చెందిన తోట సుధీర్.

రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ విభాగ కమిటీ

రాష్ట్ర సెక్రటరీలుగా ఏలూరు జిల్లాకు చెందిన గంధం రామమోహనరావు (చంటి), పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన యర్రా కేశవరావు, జాయింట్ సెక్రటరీగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బొడ్డు సుబ్బారావును నియమించారు.

బ్యాడ్మింటన్ కోర్టు అభివృద్ధికి చర్యలు

ఏలూరు(మెట్రో): ఏలూరు ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేయనుందని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా టోర్నమెంట్‌లో క్రికెట్, బ్యాడ్మింటన్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలను గురువారం కలెక్టర్ సత్కరించి అభినందించారు. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోర్టు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆడుదాం ఆంధ్రలో పాల్గొన్న క్రికెటర్ ఐపీఎల్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వంశీకృష్ణరాజు ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, డీఆర్వో డి.పుష్పమణి, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు, క్రీడా కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారు.

కలిదిండిలో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం



కలిదిండిలో పాలిటెక్నిక్ కళాశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, డీఎన్నార్

కైకలూరు/కలిదిండి: దివంగత వైఎస్సార్ ఆశయాలను నూరుశాతం సీఎం జగన్ అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. కలిదిండిలో రూ.8 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో కలిదిండి ప్రాంతంలో ప్రజలకు సాంకేతిక విద్యను అందించడానికి పాలిటెక్నిక్ కాలేజీకి అనుమతులు ఇచ్చారన్నారు. ఆయన మరణానంతరం పనులు జరగలేదని, సీఎం జగన్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయించారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నారన్నారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడానికి సకల సౌకర్యాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్మించామన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ సీఎం జగన్ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు చందన ఉమామహేశ్వరరావు, అడవి కృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్లు కొల్లాటి సత్యనారాయణ, చేబోయిన వీరరాజు, రాష్ట్ర క్షత్రియ, హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి శ్రీదేవి, గంటా సంధ్య, సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

చిలకలగండిలో పెద్ద పులి దాడి


చిలకలగండి సమీపంలో ఆవు కళేబరం


పులి దాడి చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

బుట్టాయగూడెం: చిలకలగండి సమీపంలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన ఆవు, దూడపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. గురువారం ఉదయం గ్రామస్తులు చనిపోయిన ఆవు, దూడ కళేబరాలను చూసి తీవ్ర భయాందోళనకు గరయ్యారు. వెంటనే పులి దాడి ఘటనపై ఫారెస్టు అధికారులకు సమాచారాన్ని అందించారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. గడ్డపల్లి, గిన్నేపల్లి, చిలకలూరు, ధారావాడ పరిసర ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు.

దినకరుని కల్యాణం చూతము రారండి

- తణుకులో రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయం
- రథ సప్తమి సందర్భంగా ఏటా కల్యాణోత్సవం
- పలు జిల్లాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు



తణుకులో శ్రీసూర్యదేవాలయం, తణుకు సూర్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన చలువ పందిర్లు, బారికేడ్లు


తణుకులో కొలువు దీరిన సూర్య నారాయణస్వామి

తణుకు అర్బన్: శ్రీసూర్యభగవానుడి కల్యాణమహోత్సవానికి తణుకులోని శ్రీసూర్యదేవాలయం ముస్తాబైంది. ఈనెల 16న రథ సప్తమి సందర్భంగా సూర్యదేవాలయంలో ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేతుడైన శ్రీసూర్యభగవానుడికి కల్యాణం నిర్వహించేందుకు దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యదేవాలయం తరువాత అదే తరహాలో స్వామివారి కల్యాణం జరిపించే తణుకు సూర్యదేవాలయానికి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా వేలసంఖ్యలో భక్తులు తరలి వస్తుండటంతో దీనిని దృష్టిలో పెట్టుకుని తణుకులో ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే చలువ పందిర్లు వేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

అరుదైన విగ్రహం

తణుకు సూర్యదేవాలయంలోని స్వామి విగ్రహం సప్త అశ్వాలతో అనూరుడను సారథితో ద్వారపాలకుల పహారాతో ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేతుడైన సూర్యభగవానుడి విగ్రహం అరుదైనదిగా చరిత్రలో నిలిచింది. 1942వ సంవత్సరంలో తణుకుకు చెందిన జోశ్యుల శ్రీరామమూర్తి స్థాపించిన తణుకు ఆలయంలోని ఈ సూర్య విగ్రహం స్కాంధ, పద్మ పురాణాల్లో ప్రస్తుతించబడిన విధంగా చూపరులకు నేత్రానందం కలిగిస్తోంది. 2001వ సంవత్సరంలో తణుకుకు చెందిన చిట్టూరి పరిపూర్ణ బ్రహ్మనంద చౌదరి, భక్తుల సహకారంతో ఆలయాన్ని పునఃప్రతిష్ట చేశారు.

ఏటా ఘనంగా రథ సప్తమి వేడుకలు

ప్రతి ఏటా తణుకులో రథ సప్తమి సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తుంటారు. కల్యాణాన్ని తిలకించేందుకు 60 వేలకు మందికిపైగా భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది కూడా అదే సంఖ్యను దృష్టిలో పెట్టుకుని దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ పెద్దల పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం, దివ్యదర్శనం కార్యక్రమాలకు అంతా ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఉదయం 11.30 గంటలకు కల్యాణం

శ్రీసూర్యభగవానుడికి శ్రీవైఖానస ఆగమశాస్త్ర ప్రకారం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు పండితులు ముహూర్తం నిర్ణయించారు. ఉదయం 5 గంటల నుంచి స్వామివారి దివ్యదర్శనం, 2 గంటలకు రథోత్సవం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజాదికాలు నిర్వహిస్తారు. తణుకుకు చెందిన పెన్మెత్స సీతారామచంద్రరావు దంపతుల ఆర్థిక సాయంతో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమాన్ని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



గతేడాది రథ సప్తమికి సమారుగా 60 వేల మంది భక్తులు సూర్యభగవానుడిని దర్శనం చేసుకున్నారు. ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న రీత్యా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సూర్యాలయం వీధి పొడవునా చలువ పందిర్లు, భక్తులు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకునేలా బారికేడ్లు నిర్మించాం. స్వామివారి దివ్యదర్శనం, కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేస్తాం.

– ముత్యాల సత్యనారాయణ, ఈవో, తణుకు సూర్యదేవాలయం

జవాన్ రమేష్‌బాబుకు అంతిమ నివాళి


నివాళి అర్పిస్తున్న 19వ ఆంధ్ర బెటాలియన్ అధికారులు, ఎన్‌సీసీ అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కోల్‌కతాలో విధులు నిర్వర్తిస్తున్న 872 ఎల్‌టీ రెజిమెంట్‌కు చెందిన జగజ్యోతుల రమేష్‌బాబు అస్వస్థత కారణంగా కోలకత్తా ఆర్మీ ఆసుపత్రిలో బుధవారం తుదిశ్వాస విడిచారు. కోలకత్తా నుంచి హైదరాబాద్‌కు ఎయిర్ లైన్స్ ద్వారా అక్కడ నుంచి అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెంనకు రమేష్‌బాబు పార్థివదేహం చేరింది. 19వ ఆంధ్ర బెటాలియన్ ఆఫీసర్ ఇన్ కమాండ్ కల్నల్ సౌరబ్ ముఖర్జీ, ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, సుబేదార్, హవల్దార్లు ఆదినారాయణ, దోమిని, మీ బూసింగ్, కేశందర్ సింగ్, ప్యారా రైడర్ నవీన్‌సాయి, టి.భోగేశ్వరరావు, ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావులు రమేష్‌బాబు భౌతికకాయాన్ని దర్శించి నివాళి అర్పించారు. జాతీయ జెండాను, యూనిఫాంలను భార్య జె.బిందు, కుమారుడు అఖిల్, సోదరి మాలతీ దేవి, బావ కొడవకొల్లు వెంకటేశ్వరరావులకు అందజేశారు. పట్టణంలో అంత్యక్రియలు జరిగాయి. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

భీమవరం: అనాకోడేరు కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడిని కాళ్ల మండలం కోనాలపల్లి గ్రామానికి చెందిన సిరింగి విస్సాకు (52)గా నిర్ధారించినట్లు టుటౌన్ ఎస్సై జీజే ప్రసాద్ గురువారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విస్సాకు మతిస్థిమితం లేకపోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటినుంచి బయటకువచ్చాడు. అయితే గురువారం ఉదయం అనాకోడేరు కాలువలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో వివరాలు సేకరిస్తుండగా మృతుని సోదరుడు డేవిడ్ మృతదేహాన్ని గుర్తించాడు. ఈ మేరకు మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి అదృశ్యం.. బావిలో మృతదేహం లభ్యం


రవి మృతదేహం

లింగపాలెం : ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమై గురువారం బావిలో శవమై కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి. చింతలపూడి మండలం బాలవారిగూడెంకు చెందిన రాయల రవి (25) ఈ నెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని తండ్రి ఆంథోని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో ఉన్న తన కొడుకును బాబురావు అనే వ్యక్తి బయటకు వెళ్లి వద్దామని చెప్పి తీసుకువెళ్లాడని, తరువాత నుంచి కనపడ లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, ఈ నెల 13వ తేదీన మండలంలోని పుప్పాలవారిగూడెంలో కోడిపందేల స్థావరంపై ధర్మాజీగూడెం పోలీసులు దాడి చేయగా, కొంతమంది పందేలరాయుళ్లు పరారయ్యారు. ఈ క్రమంలో రాయల రవి కూడా పరుగు తీసి సమీపంలో ఉన్న నేలబారు బావిలో పడి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం స్థానికుల ద్వారా ఆలస్యంగా వెలుగులోకి రావడంతో గురువారం ధర్మాజీగూడెం పోలీసులు, ఫైర్ సిబ్బంది పుప్పాలవారిగూడెం బావిలో నుంచి రవి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పురుషుల ఖోఖో జిల్లా జట్టు ఎంపిక

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ పురుషుల ఖోఖో జట్టు ఎంపిక ఈ నెల 16న లింగపాలెం మండలం గోకవరం ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు పశ్చిమగోదావరి జిల్లా ఖోఖో అధ్యక్ష కార్యదర్శులు ఇ.సాంబశివరావు, రంగారావు తెలిపారు. గురువారం గంగన్నగూడెంలో వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 26 వరకు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో నిర్వహించే 56వ సీనియర్ ఖోఖో టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపిక చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- 27 మంది ప్రయాణికులకు గాయాలు
- ఐదుగురికి తీవ్ర గాయాలు, మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలింపు
- దొరమామిడి నుంచి వస్తుండగా ప్రమాదం
- జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో ఘటన


జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సీఐ పి.రాజేష్




బస్సు ప్రమాదంలో క్షతగాత్రులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 27 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురికి తీవ్రగాయాలు కావడంతో వారిని మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. దొరమామిడి నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సు జంగారెడ్డిగూడెం సమీపంలో బైపాస్ రోడ్డును దాటుతోంది. అదే సమయంలో రాజమండ్రి నుంచి అశ్వారావుపేట వైపు వేగంగా వెళుతున్న లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. దీంతో బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురై అందులోని ప్రయాణికులు చెల్లాచెదురుగా పడిపోయారు. బస్సులోని ఇనుప రాడ్లు తగిలి 27 మంది ప్రయాణికులు గాయపడగా, వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స చేసి ఏలూరు ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ప్రమాదవార్త తెలుసుకున్న ప్రయాణికుల బంధువులు, స్నేహితులు ఆసుపత్రికి చేరుకోవడంతో ఆసుపత్రి ఆవరణ రద్దీగా మారింది. జంగారెడ్డిగూడెంకు డిపోకు చెందిన బస్సు బుట్టాయగూడెం మండలం దొరమమిడిలో బుధవారం నైట్ అవుట్ చేసి గురువారం ఉదయం 6 గంటలకు దొరమామిడి నుంచి జంగారెడ్డిగూడెంకు బయలుదేరింది. ఉదయం 8.20 గంటలకు జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డు దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

గాయాలపాలైన ప్రయాణికుల వివరాలు

నకిడికల్లి జ్యోతి, షేక్ నజియా బేగం, జుత్తుగ ఇందిర, తాంద్రు పావని, సవలం వెంకటలక్ష్మి, సోయం వెంకటలక్ష్మి, యండపల్లి శైలజ, కొరసా రామసీత, గుడ్డు కృష్ణవేణి, కొరసా రామసీత, బాడి సుజాత, అడ్డగర్ల వైష్ణవి, సరియం శిరీష, నక్క అలివేలు, మడకం వెంకటలక్ష్మి, సలపం వాసంతి, జుజ్జుగ వెంకటలక్ష్మి, సోగ చిట్టెమ్మ, పుంజుగుల పవన్‌కుమార్, నంద ప్రసన్న, మోత్రపు సందీప్, బుగ్గా కవిత, సొంగ మహేష్, పామిలేటి ప్రేమరెడ్డి, పామిలేటి పార్వతి, బిల్లే జ్యోతి, జెట్టి ప్రవీణలకు గాయాలయ్యాయి. కాగా వీరిలో నక్కా అలివేలు, పుంజుగల పవన్‌కుమార్, కొరసా రామసీత, జుత్తుగ ఇందిర, మోత్రపు సందీప్‌లకు కాళ్లు, చేతులు, తుంటి ఎముక భాగాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ

బస్సు ప్రమాదంలో క్షతగాత్రులను పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీటీసీ, వైసీపీ ప్రచార కమిటీ అధ్యక్షులు పోల్నాటి బాబ్జి, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, సీఐ పి.రాజేష్ తదితరులు పరామర్శించారు. కాగా ఘటనపై ఎస్సై జ్యోతిబాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాల నివారణ


మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ జి.స్వరూపరాణి, డీటీసీ శాంతకుమారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా సురక్షిత ప్రయాణాలు చేయాలని డీటీసీ ఎస్.శాంతకుమారి పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ సెంటర్ నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీని డీటీసీ ఎస్.శాంతకుమారి, ఏఎస్పీ జీ స్వరూపరాణి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ పోలీసు, రవాణా శాఖ సమన్వయంతో వాహనదారుల భద్రత, ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా రోడ్డు భద్రత వారోత్సవాలను జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గురువారం హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై అవగాహన కలిగించడానికి మోటార్ సైకిళ్ల ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది ఏలూరు జిల్లాలో 636 రోడ్డు ప్రమాదాలు జరగగా, 224 మంది ప్రాణాలు కోల్పోయారని, 617 మంది గాయాలపాలయ్యారన్నారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం, కారులో సీట్ బెల్ట్ ఉపయోగించుకోకపోవడం, కారుల్లో పాటలు, సెల్‌ఫోన్లు ఉపయోగించడం, ఓవర్ టేక్ చేయడం తదితర కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరిగాయన్నారు. జిల్లా అదనపు ఎస్పీ జీ స్వరూపరాణి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఈ ఏడాదిలో నెలా 15 రోజుల్లో 74 రోడ్డు ప్రమాదాలు జరిగాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ నాణ్యత గల హెల్మెట్‌ను ధరించి, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహన ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, రవాణా శాఖ అధికారులు, మోటారు వెహికల్స్ షోరూం ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మవారు, ముస్తాబైన ముఖద్వారం

దెందులూరు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గాలాయగూడెం గ్రామ దేవత శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24వ తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభిస్తారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు కైకలూరుకు చెందిన నేషనల్ అవార్డు గ్రహీత గురువు కుమారి లక్ష్మీజ్యోతి కూచిపూడి నృత్యం, అనంతరం డాన్స్ బేబీ డ్యాన్స్, మ్యూజికల్ నైట్, మిమిక్రీ షో నిర్వహిస్తారు. 17న రాత్రి 9 గంటలకు వెన్నెల ఆర్కెస్ట్రాతో సినీ మ్యూజికల్ నైట్ కార్యక్రమం ఉంటుందని, 18న సత్యహరిశ్చంద్ర వారణాసి కాటిసీను నాటక ప్రదర్శన, 19న ప్రముఖ గాయకురాలు మంగ్లీ టీం, సన్నీ ఈవెంట్స్ కార్యక్రమం, 20న శ్రీరామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన, 21న రాత్రి 9 గంటలకు జబర్దస్త్ టీం ఆధ్వర్యంలో సుప్రీం ఆర్కెస్ట్రా కార్యక్రమం, 22న బాలనాగమ్మ మాయల పకీరు నాటకం చింతామణి నాటకం, 23న రాత్రి 9 గంటలకు హైదరాబాద్, విజయవాడ, తాడేపల్లిగూడెం కళాకారులతో రాక్‌స్టార్ ఈవెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 24న మధ్యాహ్నం వేలాదిమంది భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి అగ్నిగుండం ప్రవేశ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా వేద పండితులు, గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహిస్తారు. 25న ఉదయం 11 గంటల నుంచి వేలాది మందికి భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని వివరించారు.

సొంతింటి కల.. నెరవేరిన వేళ..

- జగనన్న కాలనీల్లో చురుగ్గా ఇళ్ల నిర్మాణం
- అన్ని వసతులు కల్పిస్తున్నా ప్రభుత్వం
- లబ్ధిదారుల హర్షం

ఇరగవరం: పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలందరి ప్రధాన కోరిక సొంతిల్లు, మంచి ఇల్లు కట్టుకుని పిల్లా పాపలతో సంతోషంగా ఉండాలని కలలు కంటారు. కానీ నేటి పరిస్థితుల్లో ఆ కోరిక చాలా మందికి కలగా మిగిలిపోయింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కలను సాకారం చేశారు. పేదలందరికీ ఇళ్లు ఇస్తానని ఎన్నికల సమయంలో ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి రాగానే కార్యాచరణ చేపట్టారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం కోసం ఇరగవరం, తణుకు, తణుకు అర్బన్, అత్తిలి మండలాల్లో 120 లే అవుట్లు ఏర్పాటు చేసి వాటిలో 12,325 మందికి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సొంత సైట్లల్లో 3152, మొత్తం 15,477 గృహాలు మంజూరయ్యాయి. ఇప్పటికే 4953 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 10,524 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి .



ఇరగవరం మండలంలో శరవేగంగా పూర్తవుతున్న జగనన్న గృహాలు

ఇంటి నిర్మాణనికి సాయం

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలను ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నగదు బేస్‌మెంట్, రూఫ్ లెవల్, శ్లాబ్, నిర్మాణం పూర్తయ్యాక వివిధదశల్లో అందజేస్తారు. ఈ నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌ల్లో జమ అవుతుంది. అలాగే సొంత స్థలం ఉన్న వారికి ఈ పథకం వర్తింప జేస్తున్నారు. 1.50 సెంట్లు ఉన్నవారు అర్హులు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహ నిర్మాణ శాఖ ఈ అవకాశం కల్పిస్తుంది.

ప్రతిపక్షాలతో కోర్టు వివాదాలు

పేదలందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాడాన్ని ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నారు. వారు కొన్ని స్థలాల విషయంలో కోర్టుకు ఎక్కడంతో అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కలేదు.ఆ ఒక్క గ్రామంలో ఈ సమస్య ఏర్పడింది. మిగిలిన గ్రామల్లో సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించడం జరిగింది.

అద్దె కట్టలేక ఇబ్బంది పడ్డాం


సొంతిల్లు లేక పోవడంతో అద్దె కట్టుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రతి నెలా రూ. 2500 నుంచి 3000 వరకు అద్దె చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడేది. మండల కేంద్రాల్లో భారం మరీ ఎక్కువగా ఉండేది. నా సొంతింటి కల నేరవేరడం ఆనందంగా ఉంది.

– జుత్తిగ సత్యనారాయణ, గోటేరు గ్రామం

జగనన్న మేలు మరువలేం


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం. ఆయన చొరవతో సొంతిల్లు నిర్మించుకున్నాం. త్వరలో గృహ ప్రవేశం చేసుకుంటాం. మండలంలోని నా 1.50 సెంట్లు స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణం కోసం రూ. 1.80 లక్షలు అందించారు.

– ఎం బేబీ, గోటేరు గ్రామం

జోరుగా ఇళ్ల నిర్మాణం


ఇరగవరం 42,అత్తిలి 48, తణుకు 25, మొత్తం 120లే అవుట్లులో 15,477 మంది లబ్ధిదారులు ఉన్నారు. అందులో 3,152 సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వీటిలో4,953 గృహాలు పూర్తయ్యాయి. 10554 గృహాలు వివిధ దశలోల నిర్మాణంలో ఉన్నాయి. విద్యుత్, తాగునీరు, రోడ్లు, మౌళిక వసతులు కల్పిస్తున్నాం.

– కె కె డి టి వి ప్రసాద్, తణుకు హౌసింగ్ డిఈఈ

జగనన్నకు కృతజ్ఞతలు


జగనన్న మేలు మరవలేం. పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. రేలంగి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు ఇవ్వడమే కాకుండా వాటి నిర్మాణాన్ని కుడా దాదాపుగా పూర్తి చేయడం జరిగింది. దీంతో లబ్ధిదారులు అందరూ ఆనందంగా ఉన్నారు.

– పులుపు అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు, రేలంగి

దాతల సహకారంతో క్రీడా సదుపాయాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఔత్సాహికులైన దాతలు సహకారంతో తాడేపల్లిగూడెంలో మరింత మెరుగైన క్రీడా సదుపాయాలను సమకూర్చుకోవచ్చునని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డా. పీఎల్‌వీ ప్రసాద్ మున్సిపల్ స్పోర్ట్స్ అరేనాను గురువారం మంత్రి కొట్టు ప్రారంభించారు. ఆధునిక సదుపాయాలతో ఈ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు మూడింటిని, మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన జిమ్ ను మంత్రి కొట్టుతో పాటు అతిధులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఇండోర్ స్టేడియం లేదనే కొరత దీనితో తీరుతుంది అన్నారు. ప్రజా వైద్యుడిగా పేరుపొందిన డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ పేరు మీద ఇది ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీని నిర్వహణకు త్వరలోనే విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందిస్తామని మంత్రి కొట్టు వెల్లడించారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడపై తనకు ఎంతో ఆసక్తి ఉందన్నారు. ప్రజలందరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జీఆర్ రెడ్డి, దంతవైద్యులు శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి, ఆయా కోర్టులను ఆడి ప్రారంభించారు. త్రిబుల్ ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ గోయంకా, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, కర్నాటి కన్నయ్య, చెన్నా జనార్ధనరావు, దాసిబాబు తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కొండేపాడు పంచాయతీ పనులపై విచారణ

పెంటపాడు: కొండేపాడు గ్రామ సర్పంచ్ కట్టా దానయ్య నిధుల దుర్వినియోగం చేస్తున్నారన్న సభ్యుల ఆరోపణపై గురువారం సాయంత్రం జిల్లా పంచాయతీ డివిజనల్ అధికారి (ఇన్‌చార్జి) సీహెచ్ బాలాజీ బహిరంగ విచారణ చేపట్టారు. సుమారు 10 అంశాలపై పలువురు సభ్యులు సర్పంచ్‌పై ఆరోపణలు చేసిన మీదట ఈ విచారణ జరిగింది. దీనిపై డీఎల్‌పీవో బాలాజీ వాస్తవాలు తెలుసుకొనేందుకు సభ్యులు, కార్యదర్శి శ్రీరంగ, సర్పంచ్ కట్టా దానయ్య, గ్రామ ప్రజలు తదితరులపై విచారణ చేశారు. చెరువులో కలువపూలు అమ్ముకోవడం, డ్రెయినేజీ పైపు లైన్లకు ఒక్కో వ్యక్తి నుంచి రూ. 5 వేలు తీసుకోవడం, చెత్తరిక్షా వ్యక్తిని పనిలోంచి తీసివేయడం వంటి పనులతో పాటు, తీర్మానాలు సభ్యులకు చెప్పకుండా సంతకాలు తీసుకోవడం వంటి సభ్యులు చేసిన ఆరోపణలో వాస్తవం లేదని, అటువంటి చర్యలకు తాను పాల్పడలేదని ఈ సందర్భంగా విచారణలో సర్పంచ్ కట్టా దానయ్య డీఎల్‌పీవో బాలాజీ తెలిపారు. దీనిపై డీఎల్‌పీవో బాలాజీ మాట్లాడుతూ విచారణలో నమోదు చేసుకొన్న అంశాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు గ్రామ కార్యదర్శి రామారావు, ఈవోపీఆర్డీ ఎవీఎస్‌వీ ప్రసాద్, వార్డు సభ్యులు పంపన రాంబాబు, ఉపసర్పంచ్ బిట్రా లక్ష్మి ఎంపీటీసీ సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.


బి.కొండేపాడు పంచాయతీ నిధులపై విచారణ చేస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీలో చేరికలు


అయినపర్రులో జనసేన, టిడిపి నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు

ఇరగవరం: రాష్ట్రంలో సీఎం జగన్ ప్రజారంజక పాలనతోనే వైఎస్సార్‌సీపీలో చేరికలు ఉంటున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం మండలం కె. ఇల్లిందలపర్రు గ్రామంలో 500, పేకేరు శివారు నిట్లవారితోట గ్రామంలో 150, ఓగిడి గ్రామంలో 200, అయినపర్రు గ్రామంలో 150, కాకిలేరు గ్రామంలో 200 మొత్తంగా 1,200 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి మంత్రి కారుమూరి సాదరంగా ఆహ్వానించారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ఇరగవరం: గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర పౌరసఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం ఇరగవరం మండలంలోని మొత్తం 526.86కోట్ల రూపాయాల అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని వివరించారు. గతంలో గ్రామాల్లో ఏ పని జరగాలన్న మండల కేంద్రాలకు వెళ్లి పనులు మానుకొని తిరగాల్సి వచ్చేది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి గడపకు సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలు అందరి కోసం సీఎం జగన్ 126 సార్లు బటన్ నొక్కరు మీరు రానున్న ఎన్నికల్లో రెండు బటన్‌లు నొక్కి సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి , ఏమ్మెల్యేగా నన్ను గెలిపించాలని కోరారు. ఓగిడి గ్రామంలో గతంలో వలంటీరుగా పనిచేసి వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ. 25వేలు ఆర్థిక సహాయాన్ని మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెటి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, జెసిఎస్ దినేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు మల్లి రెడ్డి నాగార్జున ,చవ్వాకుల శ్రీనివాస్, సైపురెడ్డి పెద్దిరాజు, సత్తిబాబు, సర్పంచ్‌లు ఘంటా లక్ష్మీ, ఉన్నామట్ల నాగమణి, ఘంటా అప్పారావు, కంకిపాటి శ్రీనివాస్, బెల్లంకొండ హేమ కుమారి,సురేష్, రామాయణం జగదీష్, సత్తి అఖిల రెడ్డి, కార్యదర్శులు జి వెంకట లక్ష్మి, ఫణీంద్ర నాయకుల సత్తి వెంకట రెడ్డి, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, చోడే ఏసురత్నం, అభిమానులు పాల్గొన్నారు.


ఇరగవరం మండలంలో మంచినీటి ట్యాంకు వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

మహోన్నత వ్యక్తి దొమ్మేటి వెంకటరెడ్డి

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: శెట్టిబలిజల ఆత్మగౌరవాన్ని పెంచి వారి అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం మండపాక శివారు యర్రనీలిగుంట గ్రామంలో నెలకొల్పిన దొమ్మేటి వెంకట రెడ్డి విగ్రహాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దొమ్మేటి వెంకట రెడ్డి శెట్టిబలిజ కులంలో పుట్టిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. ఆయన శెట్టి బలిజ కులస్థుల అభివృద్ధికే కాకుండా మొత్తం బీసీ కులాలతో పాటు కాపుల సంక్షేమానికి కూడా ఆయన కృషి చేశారని చెప్పారు. అనేక మంది మహనీయుల స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి రూ. 2 కోట్ల సొంత నిధులతో నియోజకవర్గంలోని గ్రామాల్లో దొమ్మేటి వెంకట రెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించే కనక దుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి మంత్రి కారుమూరి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో తణుకు, అత్తిలి మండలాల శెట్టి బలిజ సంఘాల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.


యర్రనీలిగుంటలో దొమ్మేటి వెంకట రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు మణికంఠసాయి ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బి.మణికంఠ సాయి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం స్కూలు ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శనలో మణికంఠ సాయి రూపొందించిన డ్రంకెన్ డ్రైవ్ నిషేధిత ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. భవిష్యత్‌లో మంచి శాస్త్ర సాంకేతిక రంగంలో సాయి రాణించే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయురాలు పి.శ్రీలక్ష్మి ప్రోత్సాహం, బోధన తీరును పలువురు అభినందించారు. డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే.జ్యోతి, యుటీఎఫ్ నాయకులు మైనం సత్యనారాయణ, శివప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాసరావు, ప్రియాంక తదితరులు మణికంఠ సాయిని అభినందించారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి మణికంఠసాయిని అభినందిస్తున్న దృశ్యం

నమస్తే యాప్‌లో నమోదు చేయించుకోవాలి

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) పథకంలో సెప్టిక్ ట్యాంక్‌లు శుభ్రపరిచే కార్మికులు, ట్యాంక్ డ్రైవర్లు, హెల్పర్లు తమ జీవ భద్రత, మెరుగైన ఉపాధి కల్పన, సామాజిక న్యాయం కోసం నమోదు చేయించుకోవాలని తణుకు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కొవ్వూరి ఈశ్వరరెడ్డి కోరారు. తణుకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

దేవదాయశాఖలో విప్లవాత్మక మార్పులు

- 20కొత్త డీసీ పోస్టులు మంజూరు
- గజమాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపిన డీసీలు, ఏసీలు

తాడేపల్లిగూడెం అర్బన్: ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆ శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఆ శాఖకు చెందిన పలువురు సీనియర్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఒప్పించి ఆయన అంగీకారంతో ఒకేసారి 20 డిప్యూటీ కమిషనర్ పోస్టులు కొత్తవి మంజూరు చేయించి అరుదైన రికార్డు నెలకొల్పారని వారు కొనియాడారు. ఇటీవల దేవదాయ ధర్మాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్లగా, అసిస్టెంట్ కమిషనర్లగా పదోన్నతులు పొందిన వారు గురువారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని వారంతా ఘనంగా సన్మానించారు. భారీ గజమాలలతో, శాలువాలతో సత్కరించారు. ఆయా దేవస్థానాలు నుంచి తీసుకువచ్చిన స్వామి వార్ల, అమ్మవార్ల ప్రతిమలు, చిత్ర పటాలను, ప్రసాదాలు అందజేశారు. వివిధ ఆలయాల నుంచి వచ్చిన వేద పండితులు, అర్చక స్వాములు వేద పఠనం, మంత్రోచ్ఛరణలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవదాయ శాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మంత్రి కొట్టు సత్యనారాయణ అనతి కాలంలోనే అనేకమైన సంస్కరణలు, విప్లవాత్మకమైన మార్పులతో శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలు, అర్చకులకు వేతనాలు పెంపు, దేవాలయాల ఆస్తులను పరిరక్షించేందుకు చట్ట సవరణ, పదోన్నతులు వంటి అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలను కొన్ని వందల కోట్ల రూపాయలతో సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన మోపిదేవి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి నల్లం చక్రధరరావు, డిప్యూటీ కమిషనర్ శోభారాణి, అన్నవరం దేవస్థానం జేఈవో విశ్వనాథరాజు, బాపట్ల అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, గుంటూరు డిప్యూటీ కమిషనర్ మహేష్ రెడ్డి, పదోన్నతి పొందిన కమిషనర్లు పాల్గొన్నారు.


మంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

క్లుప్తంగా

దోమల నియంత్రణ అందరి బాధ్యత


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నియంత్రణ అందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య పరిధిలో బేబి సెంటర్, యాగర్లపల్లిలో 15, 16, 19, 20 వార్డుల్లో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నీటి నిల్వలు దోమలకు నిలయాలుగా మారతాయని, వారంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూసుకోవాలని కోరారు. పురపాలక సంఘం సిబ్బందికి, హెల్త్ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు అంబిక, చంద్ర, వెంకట లక్ష్మి, నాగమల్లి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం సచివాలయం–1పరిధి బీసీ ఏరియాలో 220మీటర్ల పొడవునా రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సహకారంతో కృషి చేస్తున్నట్టు తెలిపారు. దాదాపు రూ.20లక్షలు వ్యయంతో ఈ సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే రహదారి నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), ఈవో కే.శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


గాయపడ్డ ఎలక్ట్రిషియన్‌కు ఆర్థికసాయం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: ప్రమాదంలో గాయపడ్డ ఎలక్ట్రీషయన్ కుటుంబానికి తణుకు ఎలక్ట్రిక్ అసోసియేషన్ తరపున రూ. 15వేలు ఆర్థిక సాయం అందచేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయకుమార్, బళ్ల నాని తెలిపారు. వృత్తిపరంగా ఎలక్ట్రిషియన్‌గా ఉన్న తణుకుకు చెందిన సజ్జా శ్రీనివాస్ విధినిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తూ పడిపోయి కాలు విరిగిపోగా వైద్యులు శస్త్రచికిత్స చేశారు. దీంతో గురువారం బాధితుడి ఇంటికివెళ్లిన అసోసియేషన్ సభ్యులు రూ. 15వేలు నగదు, బియ్యం బస్తా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యు.రామారావు, కోశాధికారి యు.జాన్, సహాయ కార్యదర్శి కె.పోతురాజు, కమిటీ సభ్యులు ఆనందం శ్రీను, వీరవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉల్లిపాయల మార్కెట్ జట్టు వర్కర్స్ సంఘ వార్షికోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఉల్లిపాయల మార్కెట జట్టు వర్కర్స్ యూనియన్ 38వ వార్షికోత్సవం యూనియన్ కార్యాలయంలో గురువారం చల్లా చంద్రరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా సిరపరపు రంగారావు, అధ్యక్షుడిగా చల్లా చంద్రరావు, ఉపాధ్యక్షుడిగా అల్లు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా గొర్లి శ్రీను, జాయింట్ కార్యదర్శిగా కరక వెంకట్రావు, కమెండర్‌గా బంకురు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పి.వి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి, జి.నాగేశ్వరరావు, కె.రామకృష్ణ, తదితరులు హాజరైయారు.

పోస్టల్ స్కీంలపై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం క్యాంపస్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ తపాలా పథకాలపై గురువారం క్యాంపస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీజీకేరావు, ప్రొఫెసర్ టి.అశోక్‌లు పొదుపు పథకాలు, బీమా పాలసీలు, అర్హత ప్రమాణాలు, ప్రయోజనాలు, దరఖాస్తు విధానాలపై స్పష్టత ఇచ్చారు.

నేడు వన్‌టౌన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్ బోర్డు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ రిలయన్స్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం వెల్లడించారు. గణేష్ నగర్, గాంధీబొమ్మ సెంటర్, హౌసింగ్‌బోర్డు, ఏరియా ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అత్తిలి: మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడిచేసి 6గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,030 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకోడేరు: పేకాట స్థావరంపై దాడిచేసి 7గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. విస్సాకోడేరు గ్రామ శివారులో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు.